అక్షర దర్బార్

www.aksharadarbar.com

Voice of the people




## రేపు నగరానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

- ఎన్పీడీసీఎల్ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు



## నేడు పొంగులేటి రాక

- ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో ముందస్తు కార్యాచరణపై ఉమ్మడి జిల్లా సమావేశం
- పాల్గొననున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు


మంగళవారం 21, జులై 2026 | సంపుటి : 03 | సంచిక : 152 | పేజీలు : 05 | వెల ₹5




- ఉమ్మడి వరంగల్ నుంచి సిరోంచకు పీడీఎస్ రైస్ అక్రమ రవాణా
- సిరోంచ బియ్యం డాన్ తో పీడీఎస్ రైస్ వ్యాపారుల లింకులు
- గణపురం మండల కేంద్రంలో రేషన్ బియ్యం గుట్టురట్టు
- 170 క్వింటాళ్ల పీడీఎస్ రైస్ పట్టుకున్న సివిల్ సప్లై విజిలెన్స్
- నిందితుల అరెస్టు.. విచారణ జరుపుతున్న పోలీసులు

# మళ్లీ రేషన్ దందా!

కాళేశ్వరం మీదుగా గోదావరి దాటుతున్న పేదల బియ్యం

అక్షరదర్బార్, హనుమకొండ

పేదల కడుపు నింపాల్సిన రేషన్ బియ్యం మళ్లీ సరిహద్దులు దాటుతోంది. అక్రమార్కుల ఆశల పంజరంలో చిక్కుకుని గోదావరి నది మీదుగా మహారాష్ట్ర బాట పడుతోంది. ప్రభుత్వం ఇస్తున్న సన్న బియ్యాన్ని సైతం వదలకుండా, తక్కువ ధరకు కొనుగోలు చేసి పొరుగు రాష్ట్రంలో భారీ ధరలకు విక్రయిస్తూ పీడీఎస్ మాఫియా పండుగ చేసుకుంటోంది. కాళేశ్వరం వంతెనను అక్రమ రవాణాకు ప్రధాన మార్గంగా మలుచుకున్న ఈ ముఠాలు, సిరోంచ కేంద్రంగా నడుస్తున్న బియ్యం దందాతో చేతులు కలిపాయి. తాజాగా పౌరసరఫరాల శాఖ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ నిర్వహించిన మెరుపు దాడిలో 170 క్వింటాళ్ల రేషన్ బియ్యం లభ్యం కావడంతో ఈ అంతర్రాష్ట్ర దందా బండారం మరోసారి బయటపడింది.

3



## లంచాలకు తావుండొద్దు

- అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు అందాలి
- ఇళ్ల నిర్మాణంలో స్పీడ్ పెంచాలి
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

2

## ఎంజీఎం సందర్శించిన సీపీ

- పోలీస్ అవుట్‌పోస్ట్, డీ-అడిక్షన్ కేంద్రం పరిశీలన
- సీసీ కెమెరాలు, పార్కింగ్‌పై కీలక సూచనలు
- రోగులకు, సందర్శకులకు ఇబ్బందులు కలగొద్దని స్పష్టం

2



# నేడు పొంగులేటి రాక

- ఎల్‌నీనో ప్రభావం నేపథ్యంలో ముందస్తు కార్యాచరణపై ఉమ్మడి జిల్లా సమావేశం
- పాల్గొననున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

**అక్షరదర్బార్, హనుమకొండ:**



ఎల్‌నీనో ప్రభావం నేపథ్యంలో రానున్న రోజుల్లో చేపట్టాల్సిన ముందస్తు చర్యలు, వివిధ శాఖల కంటింజెన్సీ ప్రణాళికలు, సంసిద్ధతపై ఉమ్మడి వరంగల్ జిల్లాల స్థాయి సమీక్ష సమావేశం మంగళవారం మధ్యాహ్నం హనుమకొండలోని ఐడీఓసీ కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షత వహిస్తారు. రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఉమ్మడి వరంగల్ జిల్లా ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం ప్రత్యేకంగా నియమించిన ప్రత్యేక అధికారి దేవసేన, రాష్ట్ర కాలేజియేట్ ఎడ్యుకేషన్ కమిషనర్‌తో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొంటారు. సమీక్ష సమావేశంలో సాగునీరు, భూగర్భ జలాలు, విద్యుత్, వ్యవసాయం, ఉద్యానవనం (హార్టికల్చర్), పశుసంవర్ధక శాఖ, తాగునీటి సరఫరా, పంచాయతీరాజ్, విపత్తు నిర్వహణ తదితర శాఖల సంసిద్ధత, ఎల్‌నీనో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రూపొందించిన కంటింజెన్సీ ప్రణాళికలు, శాఖల వారీగా చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై సమగ్రంగా చర్చించనున్నారు. కేవీకే, ఐసీఏఆర్ శాస్త్రవేత్తలు పాల్గొని తమ సూచనలు అందిస్తారని,

సంబంధిత శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన పూర్తి సమాచారంతో, గణాంకాలు, కార్యాచరణ ప్రణాళికలు, కంటింజెన్సీ ప్రణాళికలతో సమావేశానికి సిద్ధంగా హాజరుకావాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సూచించారు.

# ఎంజీఎం సందర్శించిన సీపీ

- పోలీస్ అవుట్‌పోస్ట్, డీ-అడిక్షన్ కేంద్రం పరిశీలన
- సీసీ కెమెరాలు, పార్కింగ్‌పై కీలక సూచనలు
- రోగులకు, సందర్శకులకు ఇబ్బందులు కలగొద్దని స్పష్టం

**అక్షరదర్బార్, వరంగల్:**




వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్ శ్వేత సోమవారం నగరంలోని ప్రముఖ ఎంజీఎం ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించారు. ఉదయాన్నే ఆస్పత్రికి చేరుకున్న సీపీ... భద్రత, ట్రాఫిక్ నిర్వహణ, రోగుల సౌకర్యాలపై అధికారులతో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన జరిపారు. ముందుగా ఎంజీఎంలోని పోలీస్ అవుట్‌పోస్ట్‌ను సందర్శించిన సీపీ శ్వేత, అక్కడి సిబ్బంది నిర్వహిస్తున్న విధులను అడిగి తెలుసుకున్నారు. మెడికో లీగల్ కేసులకు సంబంధించి తీసుకుంటున్న చర్యలు, సంబంధిత వివరాలను నమోదు చేసే రికార్డులను సమగ్రంగా పరిశీలించారు.

### సీసీ కెమెరాలు, పార్కింగ్‌పై ప్రత్యేక దృష్టి

ఎంజీఎం పరిసరాలను పరిశీలించిన పోలీస్ కమిషనర్, భద్రతకు సంబంధించి పలు కీలక సూచనలు చేశారు. ఆస్పత్రి ప్రధాన మార్గం, వాహన పార్కింగ్ ప్రదేశాలు, ఇతర ముఖ్యమైన స్థలాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు, సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పార్కింగ్ ఏర్పాట్లను క్రమబద్ధీకరించాలన్నారు. ప్రధాన ద్వారం వద్ద ఆటోలను నిలపడం వల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని, అక్కడ ఆటోలు నిలపకుండా తగిన చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీపీ వెంట సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, ఎంజీఎం సూపరింటెండెంట్ రాంకుమార్ రెడ్డి, ఆర్ఎంఓలతో పాటు ఏసీపీలు జితేందర్ రెడ్డి, సదయ్య, సత్యనారాయణ, ప్రశాంత్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు కరుణాకర్, రాఘవేందర్, ఆర్ఎస్ఐలు పూర్ణచందర్ రెడ్డి, మనోజ్, నాగరాజు తదితరులు ఉన్నారు.

### డీఅడిక్షన్ కేంద్రం పరిశీలన

**అనంతరం మత్తు పదార్థాలకు బానిసలుగా మారిన యువతకు చికిత్స అందిస్తున్న 'డీ-అడిక్షన్ కేంద్రం'ను సీపీ సందర్శించారు. మత్తుకు అలవాటు పడిన వారిని తిరిగి సాధారణ స్థితికి తీసుకువచ్చేందుకు వైద్యులు అందిస్తున్న చికిత్సా విధానాన్ని, కౌన్సెలింగ్ వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు.**

# తక్షణ పరిష్కారమే లక్ష్యం

- పైరవీలు లేకుండా నిర్భయంగా ఫిర్యాదు చేయవచ్చు
- 'ప్రజాదివాస్'లో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్

**అక్షరదర్బార్, భూపాలపల్లి:**

ప్రజల నుంచి వచ్చే సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపడమే ప్రధాన లక్ష్యమని భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అన్నారు. సోమవారం భూపాలపల్లి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజాదివాస్' కార్యక్రమంలో ఎస్పీ ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి మొత్తం 13 ఫిర్యాదులను స్వీకరించిన ఎస్పీ, ప్రతి సమస్యను శ్రద్ధగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత పోలీస్ స్టేషన్ల సీఐలు, ఎస్ఐలతో ఫోన్లో మాట్లాడి, ఫిర్యాదులపై త్వరితగతిన చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

### దళారులను నమ్మవద్దు

ప్రజలు ఎలాంటి పైరవీలు లేదా మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా నిర్భయంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలని ఎస్పీ సూచించారు. చట్టబద్ధమైన విధానంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా పోలీస్ శాఖ కట్టుబడి ఉందని, సత్వర మరియు పారదర్శకమైన సేవలు అందించడమే తమ బాధ్యత అని స్పష్టం చేశారు.

### ప్రతి సోమవారం అందుబాటులో

ప్రజలకు మరింత చేరువయ్యేందుకు ప్రతి సోమవారం 'ప్రజాదివాస్' నిర్వహిస్తున్నామని, అధికారుల సమన్వయంతో సమస్యలను వేగంగా పరిష్కరిస్తున్నామని తెలిపారు. "శాంతి భద్రతలను పరిరక్షిస్తూ, ప్రజలకు అండగా ఉండటమే భూపాలపల్లి జిల్లా పోలీస్ శాఖ ప్రధాన బాధ్యత. సమస్యలు ఉన్నవారు నేరుగా వచ్చి ఫిర్యాదు చేయవచ్చు." అని ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అన్నారు.



# లంచాలకు తావుండొద్దు

- అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు అందాలి
- ఇళ్ల నిర్మాణంలో స్పీడ్ పెంచాలి
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

**అక్షరదర్బార్, హనుమకొండ:**



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ప్రతి నిరుపేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించి, అర్హులైన లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేయాలని ఆదేశించారు. సోమవారం హనుమకొండలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో వరంగల్ పశ్చిమ పరిధిలోని 26 డివిజన్ల వార్డు అధికారులు, స్పెషల్ ఆఫీసర్లు, హౌసింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

### మొదటి విడత ఇళ్లకు నిరంతర పర్యవేక్షణ

మొదటి విడతలో మంజూరైన 3,500 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, లబ్ధిదారులకు సాంకేతిక సాయం అందిస్తూ నిధుల మంజూరులో జాప్యం లేకుండా చూడాలని ఆదేశించారు. రెండో విడత కింద మంజూరు కానున్న 2,000 ఇళ్లకు క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా అర్హులను గుర్తించాలన్నారు. ఎలాంటి రాజకీయ, వ్యక్తిగత ప్రభావాలకు తావులేకుండా అర్హతే ప్రామాణికంగా ఎంపిక జరగాలని స్పష్టం చేశారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి రాకుండా ఫైళ్లను సకాలంలో పరిష్కరించాలని, స్పెషల్ ఆఫీసర్ల పరిధిలోని పెండింగ్ దరఖాస్తులను వెంటనే క్లియర్ చేయాలని సూచించారు. కొత్త ఆసరా పెన్షన్ల కోసం వచ్చిన ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిజమైన నిరుపేదలకు సంక్షేమ ఫలాలు అందేలా చూడాలన్నారు.

### అవినీతి రహిత సేవలు

లంచాలకు, అవినీతికి ఏమాత్రం తావు ఇవ్వకుండా పారదర్శకతతో పనిచేసి ప్రభుత్వ ప్రతిష్ఠను పెంచాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. "ప్రజల సమస్యలను సానుభూతితో విని వేగంగా పరిష్కరించాలి. వార్డు అధికారులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ నాణ్యతా ప్రమాణాలతో గడువులోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయించాలి." అని నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. ఈ సమావేశంలో టీపీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాస్ రావు, మాజీ కార్పొరేటర్ అబూబకర్, డిప్యూటీ కమిషనర్ బిర్రు శ్రీనివాస్, హౌసింగ్ పీడీ సిద్ధార్థ్ నాయక్, వివిధ శాఖల స్పెషల్ ఆఫీసర్లు, వార్డు అధికారులు పాల్గొన్నారు.

# రేపు నగరానికి డిప్యూటీ సీఎం

**అక్షరదర్బార్, హనుమకొండ**



డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఈనెల 22న వరంగల్ నగరానికి రానున్నారు. ఉదయం 10.45 గంటలకు ఆయన నిట్ గెస్ట్ హౌస్ కు వస్తారు. తర్వాత 11.05 గంటలకు హనుమకొండలోని ఎన్పీడీసీఎల్ కార్పొరేట్ ఆఫీస్ కు చేరుకుంటారు. ఇక్కడ హనుమకొండ డబుల్ బెడ్ రూమ్ కాలనీ, వరంగల్ సర్కిల్ ఆఫీస్, వరంగల్ స్టోర్స్ ఆఫీస్, హనుమకొండ విజయపాల్ కాలనీ, ఆర్ అండ్ బీ క్వార్టర్స్, విద్యుత్ నగర్, హనుమకొండ సర్కిల్ ఆఫీస్ 33/11 కెవి సబ్ స్టేషన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసి ఎన్పీడీసీఎల్ కార్పొరేట్ ఆఫీస్ మీటింగ్ హాల్ ప్రారంభిస్తారు. తర్వాత 11.30 నుంచి 12 గంటల వరకు భట్టి ఎన్పీడీసీఎల్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. అనంతరం 12.30 గంటలకు ములుగు రోడ్డు సమీపంలోని వరంగల్ ఎస్ఈ ఆఫీసును డిప్యూటీ సీఎం ప్రారంభిస్తారు. 12.50 గంటలకు వరంగల్ న్యూ స్టోర్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. 1.20 గంటలకు వరంగల్ కలెక్టరేట్ కాంప్లెక్స్ వద్ద సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారు. అక్కడి నుంచి మధ్యాహ్నం రెండు గంటలకు హనుమకొండలోని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి నివాసానికి డిప్యూటీ సీఎం చేరుకుంటారు. 3 గంటలకు భట్టి ఇక్కడి నుంచి హైదరాబాద్ బయలుదేరుతారు.

# యూజీడీకి పక్కా టైమ్‌లైన్

- అలసత్వం వహిస్తే చర్యలు
- మున్సిపల్ శాఖ కార్యదర్శి డాక్టర్ టీకే శ్రీదేవి

అక్షరదర్బార్, వరంగల్: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) ప్రాజెక్టు, అర్బన్ ఛాలెంజ్ ఫండ్ (యూసీఎఫ్) పనుల ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర మున్సిపల్ పరిపాలన శాఖ కార్యదర్శి డాక్టర్ టీకే శ్రీదేవి అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుండి జీడబ్ల్యూఎంసీ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పట్టణాభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై ఆమె సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా కార్యదర్శి డాక్టర్ టీకే శ్రీదేవి మాట్లాడుతూ... ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తున్న ఈ ప్రాజెక్టుల విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) తయారీ, సాంకేతిక అనుమతులు, పరిపాలనా అనుమతులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలన్నారు. పనుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా సంబంధిత శాఖల మధ్య నిరంతర సమన్వయం ఉండాలని స్పష్టం చేశారు.

### గడువులోగా డీపీఆర్‌లు పూర్తి చేస్తాం

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జీడబ్ల్యూఎంసీ కమిషనర్ డా టి వెంకన్న మాట్లాడుతూ... అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద చేపట్టాల్సిన అన్ని పనులు నిర్ణీత ప్రణాళిక ప్రకారం వేగంగా ముందుకు సాగుతున్నాయని తెలిపారు. డీపీఆర్ తయారీ సహా సాంకేతిక, పరిపాలనా ప్రక్రియలను ప్రభుత్వం విధించిన గడువులోనే పూర్తి చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కమిషనర్‌తో పాటు సూపరింటెండింగ్ ఇంజనీర్ రాజ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రవి కుమార్, సంతోష్ బాబు, సంజయ్ కుమార్, మాధవి లత తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# షెడ్ల తొలగింపుపై వ్యాపారుల అసంతృప్తి

- ముందస్తు నోటీసులు లేకుండానే చర్యలంటూ ఆగ్రహం
- చిన్న వ్యాపారులను ఇబ్బంది పెట్టొద్దు

అక్షరదర్బార్, పరకాల: పరకాల పట్టణంలో దుకాణాల ముందు ఏర్పాటు చేసిన రేకుల షెడ్ల తొలగింపు చర్యలపై వ్యాపారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. షాపుల ముందు ఎంత మేరకు షెడ్లు ఏర్పాటు చేసుకోవచ్చనే విషయంపై స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసి, వ్యాపారులకు తగిన గడువు ఇవ్వాల్సి ఉండగా ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా తొలగింపు చర్యలు చేపట్టడం సరికాదని పరకాల ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గందె వెంకటేశ్వర్లు అన్నారు. పోలీసుల సమక్షంలో షెడ్లను తొలగించడం వల్ల చిన్న వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రొక్లెయిన్‌లతో దుకాణాల ముందు ఉన్న సిమెంట్ నిర్మాణాలను తొలగించి మట్టిని తరలిస్తున్నారని, ఆ మట్టిని ఎక్కడికి తరలిస్తున్నారో, అక్కడ ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టనున్నారో మున్సిపాలిటీ ప్రజలకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే వ్యాపారాలు మందగించి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో మున్సిపాలిటీ చర్యలు మరింత భారంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు.



తవ్విన గుంతలను ఎప్పుడు పూడుస్తారో, చేపట్టబోయే అభివృద్ధి పనుల వివరాలను ప్రజలకు వెల్లడించాలని కోరారు.పట్టణ అభివృద్ధి ప్రజలకు మేలు చేసే విధంగా ఉండాలని, వ్యాపారుల జీవనోపాధికి భంగం కలగకుండా అధికారులు వ్యవహరించాలని గందె వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. ప్రజల్లో నెలకొన్న సందేహాలు, ఆరోపణలపై మున్సిపాలిటీ అధికారులు అధికారికంగా స్పందించి పూర్తి వివరాలు వెల్లడించాలని కోరారు.



# మళ్లీ రేషన్ దందా!

- ఉమ్మడి వరంగల్ నుంచి సిరొంచకు పీడీఎస్ రైస్ అక్రమ రవాణా
- సిరొంచ బియ్యం డాన్ తో పీడీఎస్ రైస్ వ్యాపారుల లింకులు
- గణపురం మండల కేంద్రంలో రేషన్ బియ్యం గుట్టురట్టు
- 170 క్వింటాళ్ల పీడీఎస్ రైస్ పట్టుకున్న సివిల్ సప్లై విజిలెన్స్
- నిందితుల అరెస్టు.. విచారణ జరుపుతున్న పోలీసులు

## కాళేశ్వరం మీదుగా గోదావరి దాటుతున్న పేదల బియ్యం

**అక్షరదర్బార్, హనుమకొండ**

ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) బియ్యం మాఫియా మళ్లీ విజృంభిస్తుంది. రేషన్ సన్న బియ్యాన్ని కూడా సేకరించి మహారాష్ట్ర బాట పట్టిస్తుంది. పీడీఎస్ రైస్ బిజినెస్ కు అలవాటు పడిన వ్యాపారులు కొందరు గతంలో మాదిరిగానే సన్నబియ్యాన్ని సైతం సొమ్ము చేసుకుంటున్నారు. ఇక్కడ తక్కువ ధరకు రేషన్ సన్న బియ్యాన్ని కొనుగోలు చేసి పొరుగున ఉన్న మహారాష్ట్రలో ఎక్కువ ధరకు అమ్ముతున్నారు. భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం వంతెన మీదుగా రేషన్ బియ్యాన్ని గోదావరి దాటిస్తున్నారు. కాళేశ్వరం సమీపంలోని మహారాష్ట్రకు చెందిన సిరొంచలో దర్జాగా పీడీఎస్ రైస్ ను విక్రయిస్తున్నారు. ఇటీవలి కాలంగా టాస్క్ ఫోర్స్ పోలీసుల దాడుల్లో ఈ విషయం బయటపడుతుంది. తాజాగా పౌరసరఫరాల శాఖ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ దాడుల్లోనూ ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి రేషన్ బియ్యం అక్రమంగా మహారాష్ట్రకు తరలిపోతున్న నిజం మరోసారి వెలుగులోకి వచ్చింది. సిరొంచకు పంపేందుకు గణపురం మండల కేంద్రంలో ఓ వ్యాపారి తన డంపులో నిల్వచేసిన రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లై విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం పట్టుకున్నారు. సుమారు 170 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పీడీఎస్ రైస్ ను సీజ్ చేశారు. విచారణలో తేలిన వాస్తవాలను విని ఆశ్చర్యపోయారు. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి పీడీఎస్ రైస్ అక్రమంగా సిరొంచకు తరలిపోవటం ఆగలేదని, ఇక్కడి పీడీఎస్ రైస్ బిజినెస్ దారులు సిరొంచలోని రేషన్ బియ్యం డాన్ తో సంబంధాలను కొనసాగిస్తున్నారనే నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది.





### తాజాగా జరిగిందేమిటి?

భూపాలపల్లి జిల్లాలోని గణపురం మండల కేంద్రంలో పీడీఎస్ రైస్ దందా జోరుగా జరుగుతున్నట్లు పౌరసరఫరాల శాఖ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులకు సమాచారం అందింది. ఈ మేరకు పౌరసరఫరాల శాఖలోని విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ అడిషనల్ ఎస్పీ ప్రభాకర్ బృందం రంగంలోకి దిగింది. సోమవారం గణపురం మండల కేంద్రంలో ఈ బృందం పీడీఎస్ రైస్ దందాపై గట్టి నిఘా పెట్టింది. ఈ క్రమంలో ఉదయం గణపురం మండల కేంద్రంలో బియ్యం లోడుతో వెళ్తున్న ఒక టాటా ఏస్ వాహనం ప్రభాకర్ బృందం కంటబడింది. దీంతో ఈ బృందం ఆ వాహనాన్ని అనుసరించింది. అయితే బియ్యం లోడుతో ఉన్న టాటా ఏస్ వాహనం గణపురం మండల కేంద్రంలోని ఓ ఇంటి వద్దకు వెళ్ళింది. వెంటనే ఈ వాహనంలో ఉన్న బియ్యం బస్తాలను ఆ ఇంట్లో దింపే క్రమంలో ప్రభాకర్ బృందం దాడి చేసింది. ఈ బియ్యం పీడీఎస్ రైస్ అని గుర్తించిన బృందం సదరు వాహనంలో ఉన్న సుమారు 20 క్వింటాళ్ల పీడీఎస్ రైస్ ను పట్టుకుంది. తర్వాత ఈ వాహనం ఆగిన ఇంట్లో అప్పటికే నిలువ ఉన్న మరో 150 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని కూడా ప్రభాకర్ బృందం గుర్తించి స్వాధీనం చేసుకుంది. మొత్తం ఈ 170 క్వింటాళ్ల బియ్యం పీడీఎస్ రైస్ అని నిర్ధారించింది. మోటెం సారంగపాణి అనే వ్యక్తి సదరు ఇంటిని అద్దెకు తీసుకుని ఈ పీడీఎస్ రైస్ నిలువ చేసినట్లు గుర్తించింది. సారంగపాణితోపాటు వాహనం డ్రైవర్ తూర్పాటి కిషన్ ను అదుపులోకి తీసుకుని తదుపరి విచారణ కోసం గణపురం పోలీసులకు అప్పగించింది. స్వాధీనం చేసుకున్న 170 క్వింటాళ్ల పీడీఎస్ రైస్ ను గణపురం మండల కేంద్రంలోని ఓ రైస్ మిల్లులో తరలించారు. భానుచందర్ అనే ఓ వ్యాపారి ఈ పీడీఎస్ రైస్ ను తనకు ఇచ్చినట్లు మోటెం సారంగపాణి అధికారుల విచారణలో చెప్పాడని తెలిసింది.

### సిరొంచకు తరలించేందుకే..

గణపురం మండల కేంద్రంలో పట్టుబడిన పీడీఎస్ రైస్ కేసులో విచారిస్తున్న అధికారులకు విస్మయపరిచే వాస్తవాలు తెలుస్తున్నట్లు సమాచారం. గణపురంలోని ఇంట్లో పౌర సరఫరాల శాఖ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం మహారాష్ట్రలోని సిరొంచకు తరలించేందుకే వ్యాపారి నిల్వచేసినట్లు అధికారుల విచారణలో తేలిందని వినికిడి. గతంలో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి పీడీఎస్ రైస్ పెద్ద ఎత్తున సిరొంచకు తరలిపోయింది. ఇక్కడి పీడీఎస్ రైస్ బిజినెస్ దారులు పీడీఎస్ రైస్ ను సేకరించి కాళేశ్వరం మీదుగా సిరొంచకు తరలించి అమ్మడం ద్వారా భారీగా లాభాలు గడించారు. సన్న బియ్యం పంపిణీ మొదలైనప్పటి నుంచి ఉమ్మడి జిల్లా నుంచి పీడీఎస్ రైస్ సిరొంచకు తరలిపోవడం తగ్గిందని ఇన్నాళ్లు అధికారులు భావించారు. తాజా పరిణామాలను పరిశీలిస్తే పీడీఎస్ రైస్ ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి సిరొంచకు తరలిపోవడం ఆగలేదని, ఇక్కడి బియ్యం వ్యాపారులు సన్నబియ్యాన్ని కూడా స్థానికంగా తక్కువ ధరకు సేకరించి సిరొంచలోని రేషన్ బియ్యం డాన్ కు ఎక్కువ ధరకు విక్రయించడం ద్వారా ఆశించిన లాభాలను పొందుతున్నారనే నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తుంది. అయితే స్థానికంగా పీడీఎస్ రైస్ దందాను అడ్డుకోవాల్సిన వివిధ శాఖల అధికారులు కొందరు ఈ పీడీఎస్ రైస్ బిజినెస్ చేస్తున్న వ్యాపారులకు తమ వంతు సహకారం అందిస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది. కొద్దిరోజులుగా హనుమకొండ జిల్లాలో కమలాపురం, హసన్ పర్తి మండలాల్లో కూడా టాస్క్ ఫోర్స్ పోలీసులు వేరువేరుగా దాడులు జరిపి పీడీఎస్ రైస్ అక్రమ నిల్వలను పట్టుకున్నారు. వరుస ఘటనలను విశ్లేషిస్తే పీడీఎస్ రైస్ దందా జోరుగానే సాగుతున్నట్లు స్పష్టం అవుతుంది.

